# —మనిషిని మింగిన స్వార్థం

లంచం పుచ్చుకోవటం నేరం!

అయినా ఇచ్చేవారు, పుచ్చుకునే వారు లేకపోలేదు. ఈ రుగ్మత అన్ని దేశాల్లోనూ విస్తరించి, శాఖోపశాఖలుగా పాతుకుపోయినట్టు సాక్ష్యాధారాలు కోకొల్లలు!

ఇది నగ్నసత్యం!

వివిధ స్థాయిల్లో ఆరితేరినవారు... నిష్ణాతులు అసంఖ్యాకంగా వున్నారనే విషయం నిర్వివాదాంశం!

ఏ రూపంలో తీసుకున్నా అది లంచమే అవుతుంది. నా దృష్టిలో ఇదొక పడుపువృత్తికన్నా హీనమైందీ... హేయమైనదీ.

అవినీతిని అరికట్టేటందుకు చట్టము... ప్రత్యేకమైన నిఘా విభాగమూ వున్నాయ్. ఇన్ని వున్నా తిమింగలాల జోలికి పోగల సత్తా ఎవ్వరికీ లేదు. అందుకెవ్వరూ సాహసించరు. వలపన్నితే పడేదల్లా చిన్న చేపలే!

ఈ యదార్థం అందరికీ తెల్సు!... అంటే జగమెరిగిన సత్యం అన్నమాట!!

అలాంటప్పుడు...

లంచం తీసుకోవటాన్ని చట్టంగా చేసి... 'శ్లాబ్' సిస్టమ్ అమలులోకి తెస్తే బావుంటుందికదాని ఆ మధ్య మిత్రుడొకడు నాతో అన్నాడు. (పరిహాసానికే కావచ్చు!!)

ఇదీ బాగనే వుంది... అన్పించింది.

ఒక్కో పనికి ఒక్కో రేటు (లంచానికి) అనేది వుంటే... ఇచ్చి పుచ్చుకునే వారికి ఏ సంకోచమూ... భయమూ వుండదు. అన్ని పన్లూ సజావుగా జరిగిపోతుయ్.

కానీ... సాధ్యమా?

వేశ్యావృత్తిని నిర్మూలించాలని పూనుకోవటం ఎంత కష్టమో - అవినీతి విష వృక్షాన్ని కూకటివేళ్ళతో పెకలించాలనుకోవటం అంతకంటే క్లిష్టం!!

ఈ నేపథ్యంలో ఓ కథ వ్రాయాలని చాలా రోజులుగా మధన పడుతున్న నాకు ఇటీవలే... ఓ తమాషా సంఘటన తారసపడ్డది.

నేను అద్దెకుంటున్న ప్రక్క వాటాలో ఓ చిరుద్యోగి కాపురం వుంటున్నాడు. నాకు అతనితో పరిచయం వుంది. పేరు చిదంబర శాస్త్రి. మనిషి నిరాడంబరంగా అవుపిస్తాడు. నెల జీతంతప్ప మరే విధమైన ఆదాయం శాస్త్రికి లేదనే విషయం నాకు రూఢిగా తెల్సు.

శాస్త్రి భార్య మా ఇంటికి... కాఫీ పొడి కోసమో... చెక్కెరకో... చేబదులుకో... వచ్చి, నా శ్రీమతిని అడిగి పట్టుకెళ్ళటం నేనెరుగుదును.

అతను పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్‌లో దాదాపు అన్ని స్థాయిల్లో వున్నవారు 'లంచం' బాహాటంగా పుచ్చుకుంటున్నారనే విషయాన్ని నాతో అనేకసార్లు చెప్పి వాపోయేడు.

'పోనీ నువ్వూ అదేపని చెయ్యచ్చుగా' అని నేను అన్నప్పుడు... కరంట్ షాక్ తగిలినవాడిలా భయంతో వణికిపోవటం నేను గమనించకపోలేదు.

'నేను మడి కట్టుకున్న మనిషిని సార్!' అతి వినయంగా జవాబిచ్చాడు శాస్త్రి.

అదీ నిజమే అన్పించేది.

చిదంబర శాస్త్రిలో దైవభక్తి మెండు!

మూడు పూటలూ గాయత్రి చేస్తాడు.

గురు శనివారాల్లో ఏకభుక్తం! ప్రతి రోజూ సాయంత్రం దేవాలయానికి వెళ్ళి ప్రదక్షిణలు చేయటం నాకు తెల్సు.

నిత్యమూ మడి కట్టుకునే వంట చేస్తుంది శాస్త్రి భార్య.

అతనికి ముగ్గురు ఆడ పిల్లల తర్వాత ఒక మగ నలుసు.

కట్టుకున్న భార్యగానీ... పిల్లలుగానీ... ఏ పండగకైనా కొత్త బట్టలు వేసుకున్నట్టు నేనెప్పుడూ చూల్లేదు.

ఇది చాలదన్నట్టు... పక్షవాతంతో మంచాన వున్న తండ్రి... దర్భపుల్లలా అవుపించే నడుము వొంగి... చూపు కన్పించక ఇంట్లో తిరుగాడే తల్లి శాస్త్రికి ప్లస్ పాయింట్లు.

తరచు వచ్చి పోయే బంధువులతో ఇల్లు నరకంలా వుంటుంది.

అతనిపట్ల... అతని దరిద్రగొట్టు పరిస్థితిపట్లా ద్వేషం లేదు సరికదా... నాలో జాలి. సానుభూతి వున్నాయ్.

ఆ కారణంగానే అతను నోరు తెరచి ఏది ఏడిగినా కాదన్లేను.

టి.వి.లో ప్రసారమయ్యే ప్రోగ్రామ్స్ చూడటానికి శని ఆదివారాల్లో శాస్త్రి సకుటుంబంగా మా ఇంట్లోకొచ్చి కొన్ని గంటలు తిష్టవేసినా విసుక్కోము.

నాకు పిల్లల్లేరు. నాలుగు గదుల ఇంట్లో నేను, నా శ్రీమతి ఇద్దరమే!

టి.వి., టెలిఫోను... ఫ్రిజ్... సోఫాలు... వాషింగ్ మిషన్... గ్రైండరు వగైరా సామానల్తో మా ఇంటిని మోడరన్‌గా వుంచుకోవటం నాకు సరదా!

శాస్త్రి పిల్లలు బుద్ధిమంతులనే చెప్పాలి. వాళ్ళు ఎంత సేపు మా ఇంట్లో వున్నా వస్తువుల జోలికి పోరు. చెప్పిన మాట విని బుద్ధిగా వుంటారు.

కొద్దిపాటి ఆదాయంతో వారింట్లో ఏంతింటున్నారో... ఏవిధంగా సంసారాన్ని ఈదుకొస్తున్నారో... మాకు తప్ప మరోకంటికి తెలీదు.

పండగొస్తే ఇంట్లో చేసుకున్న స్వీట్లో మరోటో... దొడ్డి వేపుగా వారింటికి పంపించనిదే నా శ్రీమతికి నిద్రపట్టదు.

నాలుగేళ్ళుగా నాతో శాస్త్రికి పరిచయం వున్నా... నాతో ఎప్పుడు మాట్లాడాలన్నా... తెగ బిడియపడుతూంటాడు. అందుక్కారణం... నేను ఆఫీసరు హోదాలో వుండటమే!

అది కార్తికమాసం... ఇంట్లో ఏ అవసరానికైనా బ్రాహ్మలు దొరకటం కష్టంగా వుంది- దానికితోడు సిటీలో కర్ఫ్యూ వుంది.

తెల్లవారితే నాన్నగారి ఆబ్దికం.

ఈ కార్యాన్ని ఎలా వెళ్ళదీయటమనే దిగులు నన్ను పీక్కుతింటోంది.

కాఫీ కప్పు అందిస్తూ "మన పక్కవాటాలో వున్న శాస్త్రిగారికి మంత్రాలు కూడా వచ్చుటండీ... " చెప్పింది శ్రీమతి.

ఆ మాట వినగానే తుళ్ళిపడ్డాను. నాలో అసంతృప్తి లీలగా ముసురుకుంది.

"మంత్రాలు వచ్చినంత మాత్రాన... తద్దినాలు పెట్టిస్తాడా?... ఈ విషయం శాస్త్రితో ఎలా ప్రస్తావించడం?... " ఇబ్బందిగా ముఖం పెట్టి శ్రీమతి కళ్ళల్లోకి చూశాను.

"సాటివాళ్ళం కదా... అవసరానికి ఆ మాత్రం ఆదుకోడా ఏమిటి... ఓమారు అడిగి చూడండి... "

శ్రీమతి సలహా బాగానే వున్నదన్పించింది.

"అడిగేక... తీరా అతనేమైనా అనుకుంటే... మనం ఫీలవాల్సి వస్తుంది..."

"మరేం పర్లేదు... అడగండి... "

భార్య సలహా నాలో కొంత వూపు నిచ్చింది.

సిగరెట్ వెలిగించి వరండాలో నిలబడ్డాను. అప్పుడే చిదంబర శాస్త్రికూడా ఇంట్లోంచి వచ్చాడు.

"మీతో ముఖ్యమైన పని పడ్డది... " అర్థోక్తిలో ఆగేను.

నా మాట పూర్తి కాకుండానే సంబరాన్ని వ్యక్తం చేస్తూ "... నాతో... మీకు పనా...? అదేమిటో చెప్పండి... " అనడిగాడు.

" రేపు నా తండ్రిగారి ఆబ్దికం వుంది... బ్రాహ్మడు దొరకలేదు... పైగా సిటీలో కర్ఫ్యూ కూడా... ఎలాగాని... "

"ఓస్! అంతేగదా... నేనుండగా మీకు ఇబ్బందేమీ వుండదు." నోటినిండా నవ్వేడు శాస్త్రి.

శాస్త్రి సమాధానం కొండంత ధైర్యాన్నిచ్చింది. అయినా అతని మాటలు అర్థంకానట్టే ముఖం పెట్టాను.

" డోన్ట్‌వరీ సార్! - నేను వుద్యోగంలో చేరక పూర్వం కొన్నాళ్ళు పౌరోహిత్యం కూడా వెలగబెట్టాను - అపరకర్మలుతప్ప మిగతావన్నీ చేయించగలను - మీరేం బెంగ పెట్టుకోకండి! - మీ తండ్రిగారి తిథి నేను జరిపిస్తాను.."

అతనిలో దాగివున్న విద్యను బహిర్గతం చేసినందుకు గర్వపడ్డాను. ప్రయోజకత్వానికి ముచ్చటన్పించింది.

మాట నిలబెట్టి కార్యక్రమం జరిపించినందుకు మనసారా శాస్త్రిని అభినందించాను. అనుకున్నదానికంటే ఎక్కువే తాంబూలంలో పెట్టి తృప్తిపరిచాను. అందుకు కృతజ్ఞతతో గువ్వలా ముడుచుకుపోయాడు శాస్త్రి.

★★ ★★ ★★

రోజులు... నెల్లలు... సంవత్సరాలు గడుస్తున్నయ్.

శాస్త్రిలో వూహకు అందని మార్పేదో చోటు చేసుకోవటం నిశితంగా గమనిస్తున్నాను.

కాలంతోపాటు మనుషులూ మారక తప్పదనేది శాస్త్రి విషయంలో సరిపెట్టుకోవటానికి నా మనస్సాక్షి అంగీకరించటం లేదు.

ఇంట్లో అంతా ఆరోగ్యం... ఆనందం... ఆర్థికం బలంకూడా పుంజుకున్నట్టు అవుపించింది.

నేనూ నా శ్రీమతి అందుకు ఆనందించాం.

ఆ రోజు...

శలవు కావటాన ఆలస్యంగా నిద్రలేచి ముఖం కడక్కుండానే... వాకిట్లో నిలబడి న్యూస్ పేపరు తిరగేస్తున్నాను.

శాస్త్రి గుమ్మంలో కొత్త స్కూటరు అవుపించింది.

భార్యాసమేతంగా స్కూటరుముందు నిలబడి దానికి పూజచేసి టెంకాయ కొట్టటం... హారతి ఇచ్చి ఎర్ర నీళ్ళు దిగతుడుపు చేసి పారపోయటం... వగైరా తంతు అంతా చూస్తూ నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

నన్ను చూచేక దగ్గరగా వచ్చి స్వీటొకటి అందిస్తూ '' ఇరవై రెండు వేలు పెట్టి నిన్న సాయంత్రం ఈ స్కూటరు డెలివరీ తీసుకున్నాను సార్! ఇదిగో... ఇప్పుడే పూజ ముగించాను... '' అన్నాడు శాస్త్రి.

''శుభం!'' దీవించాను మనసారా.

''భగవంతుడి దయవల్ల నా పరిస్థితి మెరుగవుతోందండి - ఇల్లు కూడా కట్టిస్తున్నాను. మరోనెల రోజుల్లో గృహప్రవేశం... మీరు ఫామిలీతో వచ్చి, నా ఆతిథ్యాన్ని స్వీకరించాలి... '' తమాషాగా నవ్వేడు.

అతని నవ్వులో స్వాతిశయం చోటుచేసుకోవటం లీలగా అవుపించింది.

'' ఆల్ ది బెస్ట్... '' మరోసారి అభినందించి ఇంట్లోకి నడిచాను.

★★ ★★ ★★

మేడమీద వెన్నెల్లో వంటరిగా కూర్చుని మందు బాటిల్ ఓపెన్ చేశాను.

ఈ మధ్య కాలంలో బార్‌కి పోవటం పూర్తిగా మానేశాను. శ్రీమతి ఒప్పుకుంటే ఇంట్లో మందుకొట్టటంలోవున్న మజా బార్‌లోగాని మరోచోటగానీ వుండదు.

చుట్టూవున్న కొబ్బరిచెట్లగాలి చల్లగా వంటిని తాకుతోంది.

గ్లాసులో వున్న విస్కీని సిప్ చేద్దామనుకున్నక్షణంలో శాస్త్రి అక్కడ ప్రత్యక్షం కావటం నాలో ఆశ్చర్యాన్ని కలిగించింది.

''కమాన్ శాస్త్రీ! మంచి టైమ్‌కొచ్చావ్... '' మర్యాద కోసం నవ్వుతూ అన్నాను.

''నన్నూ జాయినవమంటారా?... '' అంటూ ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.

అతని ముఖంలోకి చూస్తూ 'ఎంతగా ఎదిగిపోయావ్!' అని మనసులోనే అనుకున్నాను.

''ఏమిటీ... నువ్వూ ఎంగిలి పడతావా?!''

''ఈ మధ్యే ఒకటి రెండుసార్లు మైలపడ్డాను. తప్పులేదు-మీ వంటిపెద్దల సరసన కూర్చుని పుచ్చుకోవటంలో గొప్ప థ్రిల్లుంది...''

అతడ్ని తక్కువగా అంచనా వేసినందుకు కంగుతిన్నాను.

రెండో గ్లాసు తెప్పించి, మందు వొంపి అయిసుముక్క లేశాను.

''సోడాకంటే వాటరే నయం... గ్యాస్ ట్రబుల్ వుండదు...'' అనుభవజ్ఞుడిలా మాట్లాడేడు శాస్త్రి.

లిప్తపాటు అతని ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

ఇద్దరం ఛీర్స్ చెప్పుకున్నాం!

ఇంతలోనే ఎంత మార్పు? - మార్పుకి కారణం డబ్బే అయివుండాలి!

ఒకనాటి శాస్త్రికీ ఈ రోజు ధీమాగా మాట్లాడుతున్న శాస్త్రికీ ఎంత వ్యత్యాసం? ఎంత తేడా?

సిగరెట్ వెలిగిస్తూ ''మీకో నిజం చెప్పమంటారా?...'' అన్నాడు శాస్త్రి.

నా ఎదుట శాస్త్రి సిగరెట్ తాగటం అదే ప్రథమం! అందుకు నేను ఆశ్చర్యపోలేదు. అతనూ గిల్టీ ఫీలవలేదు.

అతనేం చెప్పాలనుకుంటున్నాడు? - తన గురించా? నా గురించా?... మందు తాగటం గురించా?... ఇంకా ఎన్నో ప్రశ్నలు.

శాస్త్రీ ముఖంలోకి సూటిగా చూస్తూ ''ముందు నా ప్రశ్నలకు బదులివ్వు శాస్త్రీ...'' అన్నాను.

అతని గ్లాసు కాళీ అయింది. ఎదురుగా సీసాలోవున్న ద్రవాన్ని తనే గ్లాసులోకి వొంపుకున్నాడు.

అతని చొరవ నన్ను కుదిపింది!

''మీరేం అడగాలనుకుంటున్నారో నేను వూహించగలను- అయినా మీరేం అడగద్దు. నేనే చెప్తాను. దయచేసి నన్నే చెప్పనివ్వండి... ప్లీజ్...'' అనటంతో మందు కిక్కు శాస్త్రిలో మొదలైందనిపించింది.

శాస్త్రి ముఖంలోకే చూస్తూండిపోయాను.

'నేను ఒకప్పుడు మడి కట్టుకున్న మనిషిని సార్! దరిద్రాన్ని సంపూర్ణంగా అనుభవించినవాడిని. కష్టాలను చవిచూసేను. అయినా చలించకుండా నిష్ఠగా వున్నాను.

కానీ నాకు ఆలస్యంగా జ్ఞానోదయమైంది. నా జీతం చాలటం లేదు - చెయ్యి చాచటానికి మనస్కరించలేదు.- నేనేం చేయాలి? - అందరిలాగా నేనూ సుఖపడాలి... అవసరాలు తీర్చుకోవాలి! - ఎట్లా? - '' చెప్తూ ఆగేడు.

ఉద్వేగంగా మాట్లాడుతున్న శాస్త్రినే పరిశీలిస్తూ వున్నాను. కథనం బావుంది. ఇంకా ఏం మాట్లాడతాడో తెల్సుకోవాలనే వుత్సాహం మొదలైంది నాలో.

గ్లాసులో మిగిలిన ద్రవాన్ని గభాలున గొంతులో పోసుకున్నాడు. శాస్త్రి కళ్ళు చింతనిప్పులయ్యాయి. శృతిమించి తాగుతున్నాడేమో అన్పించకపోలేదు.

''వన్ ఫైన్ డే నాకో ఆలోచన వచ్చింది. ఓ మార్గం అవుపించింది. - అదే నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఒక్కటి మాత్రం యదార్థం! నేను సమాజం కళ్ళు కప్పగలుగుతున్నా... నన్ను నేను వంచించుకోవటమే కాకుండా... దైవానికి ద్రోహం తలపెట్టాననే భీతి నన్ను నీడలా వెంటాడి పీడిస్తోంది... '' ఆరిపోయిన సిగరెట్ ముక్కని యాష్ ట్రేలోకి నెట్టేడు.

''అసలు విషయమేమిటో చెప్పటం లేదు...''

''దేవుడి పేర లంచం తీసుకోవటం ప్రారంభించాను సార్!... '' దోషిలా తలొంచుకున్నాడు.

''అంటే... ?''

''మరేంలేదు... ఆఫీసులో అందరూ బాహాటంగా లంచం పుచ్చుకోవటం కొన్నేళ్ళుగా చూస్తున్న నాలో బలహీనత, స్వార్థం ప్రవేశించాయి. నన్ను చివరికి లొంగతీసుకున్నాయి... దేవుడి గుడి కట్టించాలనో... పూజలు జరిపించాలనో... ఉత్సవాలు నిర్వహించాలనో... చందాల రూపంలో కాంట్రాక్టర్లవద్దనుంచి డబ్బు పుచ్చుకోవటం ప్రారంభించాను... వందలు...వేలు ఆదాయం కన్పించింది. నాయందు వుండే గౌరవంతో వాళ్ళు నా మాటలు నమ్మేరు. వాళ్ళకి దొంగరసీదు లిచ్చాను... ఇంకా ఇస్తున్నాను... '' శాస్త్రి కంఠం జీరవోయింది.

అతని కంటిలో నీరు సుళ్ళు తిరగటం వెన్నెల వెలుగులో స్పష్టంగా చూడగలిగాను.

చిదంబరశాస్త్రి లంచగొండి... అవినీతిపరుడు అవునో కాదో...

ఈ సమాజం... అతను నమ్ముకున్న దేవుడు అతడిని క్షమిస్తారో లేదో...

పై ప్రశ్నలకి నాకు సమాధానం అవుపించలేదు.

*అంతే!*

---

★ (మే 1993 రచన మాసపత్రికలో ప్రచురితం)

With Best Compliments from

# Om Computers

6-1-1062/11, First Floor, Opp. R.R.Collector Office,
Lakdikapul, HYDERABAD 500 004.
Fax/Ph : 040 242163
Email: om comp@yahoo.com

- *AUTHORISED SERVICE PROVIDER for* ***COMPAQ*** *and* ***DIGITAL*** *BRANDED PCs PRODUCTS*
- *SALE & SERVICE OF BRANDED AND ASSEMBLED PCs and SERVERS*
- *SALE & SERVICE OF* **Interactive Voice Response Systems**, *indigenously designed and manufactured by* ***BAYTALKITEC (P)LTD., CHENNAI.***